ఎంబీబీఎస్‌లో 88 శాతం ఉత్తీర్ణత

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్-2022(ఫస్టియర్) పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. కళాశాలలోని 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 66 మంది ఫస్ట్ క్లాస్‌లో పాసవగా, ఇద్దరు ఉత్తమ మార్కులు(డిస్టింక్షన్స్) సాధించారు. 88 శాతం ఉత్తీర్ణత నమోదైందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వాణి తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్టియర్ పరీక్షలు గతేడాది నవంబరులో జరగగా, ప్రాక్టికల్ పరీక్షలు డిసెంబరులో జరిగాయి.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

● జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేట టౌన్, జనవరి23: ఈనెల 26న గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర వేడుకల కోసం మంగళవారం సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమిషనర్ అనురాధ సందర్శించారు. పోలీస్ పరేడ్, జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రొటోకాల్, సాంస్కృతిక కార్యక్రమాలు పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించారు. వారివెంట అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఆర్డీవో రమేష్‌బాబు, ఏసీపీ సురేందర్‌రెడ్డి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ దిలీప్ కుమార్, విద్యుత్ ఎస్ఈ మహేష్, ఐబీఆర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతినాయక్, వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి, సీఐలు సురేందర్, పూర్ణచందర్, ధరణి కుమార్ పలువురు, ఉన్నారు.



కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

సిద్దిపేటఅగ్రికల్చర్ : గౌరవెల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూసేకరణపై ఇరిగేషన్, సర్వేల్యాండ్, రెవెన్యూశాఖల అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్ కెనాల్ నిర్మించేందుకు కావాల్సిన భూసేకరణ మండలాల వారీగా చేపట్టాలన్నారు. మండల సర్వేయర్, ఆర్ఐ, ఇరిగేషన్ ఒక టీంగా ఏర్పడి ఆయా గ్రామాల్లో కాలువల భూసేకరణ వేగవంతంగా జరపాలన్నారు. కాలువల ఏర్పాటుతో జరిగే ప్రయోజనాలను వివరిస్తూ భూసేకరణ జరపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో హుస్నాబాద్ ఆర్డీవో బెన్ షాలం, ఏడీ సర్వే ల్యాండ్ వినయ్ కుమార్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఈఎస్ఎంఎస్ యాప్‌పై' అధికారులకు అవగాహన

సిద్దిపేట అగ్రికల్చర్ : ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల చీఫ్ ఎలక్షన్ కమిషనర్లు, ఆయా జిల్లాల ఎన్నికల అధికారులకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సంతోష్ ప్రతారియా గూగుల్‌ప్లే స్టోర్ నుంచి ఈఎస్ఎంఎస్ యాప్ డౌన్‌లోడ్, లాగిన్ అయ్యే విధానంపై వివరించారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రిని పట్టుకుని ఆ వివరాలను ఈఎస్ఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానం వివరించారు. అలాగే వాహనాలను తనిఖీ చేసే పద్ధతిపై జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలెన్స్ స్టాటిస్టికల్ టీమ్ (ఎఫ్ఎస్/ ఎస్ఎస్‌టీ) అధికారులకు తెలిపారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు రమేష్ బాబు, బెన్‌షాలం, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, ఎలక్షన్‌డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..



సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్నజిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ అనురాధ

పట్నంవారం బుకింగ్

ఆదాయం రూ.70.22 లక్షలు

● గతేడాది రూ.49.83 లక్షలు ● దండిగా మొక్కుబడులు.. జోరుగా ప్రసాద విక్రయాలు

చేర్యాల, జనవరి 23: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలి వచ్చి దండిగా మొక్కులు తీర్చుకోవడంతో రికార్డుస్థాయిలో బుకింగ్ ఆదాయం సమకూరింది. భక్తులు మొక్కుబడులుగా తలనీలాలు, పట్నాలు, బోనాలు, ఆర్జితసేవలు నిర్వహించారు. వీటికితోడు ప్రత్యేక దర్శనాలు, ప్రసాద విక్రయాలు, వసతిగదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.11,84,726, ఆదివారం రూ.47,82,420, సోమవారం రూ.10,55,161 చొప్పున రూ.70,22,307 బుకింగ్ ఆదాయం సమకూరింది. 8,585 పట్నాలు, 2,744 బోనాలు, 72,116 లడ్డూ, 14,890 పులిహోర ప్రసాద టికెట్లు విక్రయించినట్లు ఆలయాధికారులు తెలిపారు. గతేడాది పట్నంవారం సందర్భంగా మూడు రోజుల్లో కేవలం రూ.49.83లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.20లక్షల అదనపు ఆదాయం సమకూరింది. మల్లన్న బ్రహ్మోత్సవాలకు తోడు మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న భక్తులు భారీగా తరలివస్తుండటం కూడా ఆదాయం పెంపునకు దోహదపడింది.



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ



హుండీ నిండుకోవడంతో పైకి కనిపిస్తున్న నోట్లు

నిండిన మల్లన్న హుండీలు

మల్లన్న ఆలయంలోని హుండీలు నిండాయి. ఈనెల 7న జరిగిన స్వామి వారి కల్యాణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి కానుకలు సమర్పిస్తున్నారు. ఆలయంలోని పలు హుండీలు నిండి నోట్లు లోపలికి వెళ్లడం లేదు. కొన్ని నోట్లు పైపైనే కనిపిస్తున్నాయి. సిబ్బంది హుండీలను ఊపడంతో పాటు లోపలికి నెడుతున్నారు.

ఈనెల 25న హుండీ లెక్కింపులు

మల్లన్న ఆలయంలో ఈనెల 25న కానుకలు, ఒడిబియ్యం హుండీలను లెక్కించనున్నట్లు ఈవో బాలాజీ శర్మ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో మాతృ మరణాలు సంభవించొద్దు

● జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 23: జనవరి మాసం నుంచి ఎలాంటి మాతృ మరణాలు సంభవించకుండా నివారణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఏడాది కాలంలో జరిగిన 4 మాతృ మరణాలపై ఆమె కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మాతృమరణాలు సంభవించినపుడు డ్యూటీ చేసిన డాక్టర్లు సమీక్షకు హాజరుకావాలన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సిద్దిపేట, జిల్లా హాస్పిటల్ గజ్వేల్ ఆసుపత్రిలో రేడియాలజిస్ట్ అందుబాటులో ఉండాలన్నారు. అలాగే 24 గంటల స్కానింగ్ సౌకర్యం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ఇక నుంచి ఏమైనా పొరపాట్లు జరిగితే చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. కాశీనాథ్, పీవో ఎంహెచ్ ఎన్ డాక్టర్ రజిని, సిద్దిపేట జిల్లా జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్ట డాక్టర్ అరుణ రేఖ, గజ్వేల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ త్రివేణి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ పద్మావతి, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సిద్దిపేట క్రైం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ విద్యార్థులకు సూచించారు. రానున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో బీసీ వసతి గృహాల పదోతరగతి విద్యార్థులకు మంగళవారం సిద్దిపేటలోని బీసీస్టడీ సర్కిల్లో ప్రేరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షల్లో మెలికలు ఏ విధంగా ఉంటాయి. ఏ విధంగా సంసిద్ధం కావాలి వంటి విషయాలపై సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.గోపాల్ సుదర్శన్, చేతి రాత నిపుణులు హజాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

'గడ' రద్దు

● ఫర్నిచర్, రికార్డులు కలెక్టరేట్‌కు అప్పగింత
● మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్డీగా ముత్యంరెడ్డి

గజ్వేల్, జనవరి 23: గడ (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పదేళ్ల పాటు గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు సేవలందించిన 'గడ' ఇక కనుమరుగు కానున్నది. ఇప్పటికే గడ కార్యాలయంలోని ఫర్నిచర్, రికార్డులతో పాటు వాహనాన్ని కలెక్టరేట్‌కు అప్పగించినట్లు తెలుస్తున్నది. 2014లో గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కేసీఆర్ గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. మొదట ప్రత్యేకాధికారిగా అప్పటి ఆర్డీవో క్యాడర్ అధికారి అయిన ప్రస్తుత పంచాయతీరాజ్ డైరెక్టర్ మంత్రి ప్రగడ హనుమంతరావు పనిచేయగా, పదోన్నతిపై 2018లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. అనంతరం సిద్దిపేట ఆర్డీవోగా పనిచేస్తున్న ఏ.ముత్యంరెడ్డిని 'గడ' ప్రత్యేకాధికారిగా నియమించారు. ఆయన దాదాపు ఐదేళ్ల పాటు సేవలను అందించారు. కేసీఆర్, హరీశ్‌రావుకు విధేయుడైన ముత్యంరెడ్డిని ప్రస్తుతం గడ రద్దు కావడంతో ప్రతిపక్ష నేతగా ఎన్నికైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్డీగా సేవలను అందించనున్నారు. ఇకపై ఆయన గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. కాగా 'గడ' రద్దు కావడంతో ఇప్పటివరకు గడ పరిధిలో జరిగిన పనులు, వాటికి సంబంధించిన బిల్లులు సిద్దిపేట కలెక్టర్‌కు నేరుగా బదిలీ కానున్నాయి.

మత్స్య శాఖలో అవినీతిపై విచారణ చేపట్టాలి

● వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

మెదక్, జనవరి 23: మత్స్యశాఖ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా విచారణ జరపాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ 2022 నవంబరు 14న మత్స్యశాఖ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న సురేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అనంతరం తిరిగి అతడిని విధుల్లో చేర్చుకున్నారని. అతడినే తిరిగి 2023 ఫిబ్రవరి 23న మరోసారి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారని, మళ్లీ ఇటీవల విధుల్లో చేర్చుకోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. 38 మత్స్యకార్మిక కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున పరిహారం అందాల్సి ఉన్నా ఇప్పటికీ ఇవ్వలేదని, కానీ సస్పెండ్ అయిన ఉద్యోగిని మాత్రం విధుల్లో చేర్చుకున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



పొలంలో నాటు వేస్తున్న కూలీలు

ఎకరాకు రూ. 6 వేలు

● కూలీల కొరతతో వరినాటుకు పెరిగిన డిమాండ్ ● రైతులకు తప్పని ఆర్థికభారం

చిన్నకోడూరు, జనవరి 23: యాసంగి వరి నాటు పనులు ఊపందుకోవడంతో గ్రామాల్లో కూలీలకు డిమాండ్ పెరిగింది. గ్రామాల్లో వ్యవసాయ పనులు చేయడానికి చాలామంది ముందుకు రావడం లేదు. కూలీల సమస్యల ఏర్పడడానికి ఇది కూడా ఒకందుకు కారణం. ఈ క్రమంలో ఎకరానికి నాటు వేయడానికి కూలీలు రూ.6వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగి అదనపు భారం భరించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

చిన్నకోడూరు మండలంలో వరి నాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం మండల వ్యాప్తంగా ఈ యాసంగిలో సుమారు 16 వేల ఎకరాల వరకు వరి సాగయ్యే అవకాశం ఉంది. అయితే ఒకేసారి నాటు పనులు ఊపందుకోవడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. వరి నాటు వేయడానికి రోజుకు ఒక్కరికి కూలీ రూ.450 నుంచి 500 వరకు తీసుకుంటున్నారు. రైతులు కూలీలకు కూలితో పాటు, ఇతర ఖర్చులు భరించాల్సి వస్తుంది.

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఎకరం పొలం నాటు వేయడానికి గుత్తగా రూ.5వేలకు అడుగుతున్నారు. అయితే ఇతర రాష్ట్రాల కూలీలు దూరందూరంగా నాటు వేస్తారని, ఇతరత్రా కారణాలతో మన దగ్గర కూలీలతోనే నాటు వేయిస్తున్నామని పలువురు రైతులు చెబుతున్నారు. ఇక్కడి కూలీలు గుత్తగా ఎకరం పొలం నాటు వేయడానికి రూ.6 వేలు తీసుకుంటున్నారని తెలిపారు.



పెట్టుబడి ఖర్చులు పెరిగాయి

వరి నాటు వేయడానికి కూలీల కొరత ఉంది. పొలం దున్నడానికీ ట్రాక్టర్ ఖర్చులు పెరిగాయి. రైతులకు పెట్టుబడి ఖర్చులు రోజురోజుకు అధికమవుతున్నది. కూలితో పాటు, ఇతర ఖర్చులూ భరించాల్సి వస్తుంది. ఒక్కోసారి పెట్టుబడి కూడా రావడం లేదు.

- రెడ్డి మహేందర్ రెడ్డి, రైతు, చిన్నకోడూరు

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు చర్యలు

మెదక్ అర్బన్, జనవరి 23: ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మంగళవారం కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులైన దళితుల పట్ల పోలీస్ అధికారులతో పాటు ఇతర అధికారులు సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. వారికి వ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించేలా అధికారులు పనితీరు ఉండాలని పేర్కొన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు అందజేసి సాంత్వన కలిగించేలా చూడాలని సూచించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ వివక్ష లేకుండా అన్నివర్గాలవారు కలిసిమెలసి జీవించాలన్నారు. అనంతరం సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు.



హైటెన్షన్ స్తంభం.. ఉండేనా? కూలేనా?

మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామంలో మట్టి మాఫీయా రెచ్చిపోతున్నది. ఎల్లిగలకుంట వద్ద హైటెన్షన్ విద్యుత్ స్తంభం చుట్టూ మట్టిని తవ్వేశారు. దీంతో హైటెన్షన్ టవర్ పునాదులకు రక్షణ లేకుండా పోయింది. ఈ ఘటనపై స్థానికులు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం అందజేయగా మట్టి తరలిస్తున్న లారీని, జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ట్రాన్స్‌కో, ఇరిగేషన్ శాఖల అధికారులు టవర్‌ను పరిశీలించారు.

-మనోహరాబాద్, జనవరి 23

నేటి నుంచి కేజీబీవీల్లో 'వాయిస్ ఫర్ గర్ల్స్'

● కౌమారంలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన ● 7, 8, 9 తరగతుల బాలికలపై ఫోకస్ ● మహిళా వలంటీర్ల ద్వారా పది రోజులు ప్రత్యేక కార్యక్రమాలు



సంగారెడ్డి అర్బన్, జనవరి 23 : కౌమారదశలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడానికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యాశాఖ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయల్లో 7, 8, 9 తరగతులు చదువుతున్న బాలికల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. 'వాయిస్ ఫర్ గర్ల్స్' ఎన్‌జీవో సహకారంతో జిల్లావ్యాప్తంగా ఈ నెల 24 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లాలోని అన్ని కేజీబీల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. కౌమారదశలో బాలికలకు వివిధరకాల సమస్యలు ఎదురవుతుంటాయి. వీటిని ఏవిధంగా ఎదుర్కొనాలనే విషయాలపై 'వాయిస్ ఫర్ గర్ల్స్' ఎన్‌జీవోకి చెందిన మహిళా వలంటీర్లు పది రోజుల పాటు కేజీబీవీల్లోనే ఉండి అవగాహన కల్పిస్తారు. సేఫ్టీ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, స్ట్రెస్, మంచి, చెడు, సమస్యలు వస్తే ఎలా ఎదుర్కొనాలి? ఎలా ఉండాలి, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, హింస, సొసైటీలో ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలపై వాయిస్ ఫర్ గర్ల్స్ వలంటీర్లు విద్యార్థినులకు అవగాహన కల్పించనున్నారు. 12-15 ఏళ్ల పిల్లల వయస్సులో పిల్లలు మెలగాల్సిన తీరును వివరిస్తారు.

3,500 మంది విద్యార్థినులకు ప్రయోజనం

సంగారెడ్డి జిల్లాలో 17 కేజీబీవీలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థల్లో 7, 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 3,500 మంది ఉంటారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. గతంలో జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన క్రాంతి అక్కడ కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అదే స్ఫూర్తితో సంగారెడ్డి జిల్లాలో అమలుకు శ్రీకారం చుట్టారు. బాలికా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు కేజీబీవీ విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతాయని డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



కేజీబీవీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు





గెలుపోటములు సహజం: న్యాయాధికారి

మెదక్ అర్బన్, జనవరి 23: ఆటల్లో గెలుపోటములు సహజమని జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద పేర్కొన్నారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు.








ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో కృషి: నరేందర్

నర్సాపూర్, జనవరి 23: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో పనిచేస్తున్నదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. నర్సాపూర్ టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన డివిజన్ సర్వసభ్య సమావేశానికి నరేందర్, ప్రధాన కార్యదర్శి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఉద్యోగులు అధైర్యపడొద్దని, సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో ఎప్పుడూ ముందుంటుందన్నారు.



అప్పులు తీర్చలేక మద్యానికి బానిసై ఆత్మహత్య


కనకయ్య(ఫైల్)

రాయపోల్, జనవరి 23: అప్పులు తీర్చలేక మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా రాయపోల్ గ్రామానికి చెందిన అరికెల కనకయ్య(40) ఎనిమిదేళ్ల క్రితం అప్పులుచేసి బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. తిరిగి వచ్చిన అనంతరం పొలంలో బోరు బావి తవ్వించగా ఫెయిల్ అయ్యింది. దీంతో రూ.6 లక్షల అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనికి వెళ్లిన భార్య ఇంటికి వచ్చి చూసేసరికి కనకయ్య ఉరికి వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వాళ్లు కిందికి దించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

కోళ్ల వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన మల్లేశ్

చిన్నశంకరంపేట, జనవరి 23: కోళ్ల వ్యాన్ ఢీకొని మంగళవారం రాత్రి ఒకరు మృతిచెందారు. వెల్దుర్తి మండలం రామాయపల్లి గ్రామానికి చెందిన కురుమ మల్లేశ్(45) చేగుంట మండలం కర్నాల్‌పల్లిలోని బంధువుల ఇంటికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. చిన్నశంకరంపేట మండలంలోని మెదక్ చేగుంట రహదారిపై రుద్రారం గ్రామ శివారులో కోళ్ల వ్యాన్ ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య బాలవ్వ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.







ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్‌2 సోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

జెండాను అవమానించి.. ఆపై వీడియో తీసి..

● వివాదంగా మారిన ఘటన, ఉద్రిక్తంగా మోర్గి గ్రామం, ఐదుగురిపై కేసు


మోర్గిలో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్థులు

నాగల్‌గిద్ద, జనవరి 23: అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జెండాను అవమానించే విధంగా వీడియో చిత్రీకరించిన సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం మోర్గికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మోర్గిలో సోమవారం జరిగిన ఒకవర్గం వారి కార్యక్రమాల అనంతరం రాత్రి అదే గ్రామానికి చెందిన మరో వర్గానికి చెందిన యువకుడు ఆ వర్గానికి చెందిన ధ్వజాన్ని కించపర్చడమే కాకుండా, మనోభావాలు దెబ్బతీసే విధంగా వీడియో చిత్రీకరణ చేశాడు. ఆ వీడియోను సరిహద్దుల్లో ఉన్న కర్ణాటకలోని చిల్లర్గి గ్రామానికి చెందిన వారికి పంపడంతో ఆ గ్రామస్థులు అదే రాత్రి మోర్గికి చేరుకుని విషయాన్ని స్థానికులకు చెప్పగా.. వారు ఆ యువకుడిని పట్టుకుని తమకు అప్పగించారన్నారు. సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి, నాగల్‌గిద్ద ఎస్‌ఐ సిద్ధిరాములు సిబ్బందితో కలిసి మోర్గికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అదనపు బలగాలను రప్పించి పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఒకవర్గం మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించిన యువకుడితో పాటు అదే గ్రామానికి చెందిన నలుగురు ప్రోత్సాహకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదిలా ఉండగా నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఉదయం మోర్గి ప్రధాన రహదారిపై గ్రామస్థులు ధర్నా చేశారు. డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ సిద్ధిరాములు, కంగ్టి ఎస్‌ఐ విశ్వజన్, అదనపు బలగాలతో అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. అనంతరం డీఎస్పీ వెంకట్‌రెడ్డి, పోలీసు అధికారులు ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్న వీడియోలు ఎవరికీ పంపొద్దని, ఎవరి వద్దనైనా ఉంటే తొలగించాలని సూచించారు.

స్వచ్ఛందంగా దౌల్తాబాద్ బంద్

హత్నూర, జనవరి 23: హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో సోమవారం రాత్రి శ్రీరాముని శోభాయాత్రపై ఓ వ్యక్తి కాలు బూటు విసరడంతో ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే. ఆగంతకులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తూ దౌల్తాబాద్‌లో మంగళవారం వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి పర్యవేక్షణలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతున్నది. దౌల్తాబాద్ గ్రామానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రాజకీయ పార్టీ నాయకులను, ఆయా సంస్థల బాధ్యులను అడ్డుకునేందుకు మండలంలోని ప్రధాన రహదారులపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇదిలా ఉండగా దౌల్తాబాద్‌లో శ్రీరాముని శోభాయాత్రపై బూటు విసిరిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జిన్నారం సీఐ వేణుకుమార్ తెలిపారు.


దౌల్తాబాద్‌లో మూసేసిన దుకాణాలు

ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప బృందం పరిశీలన

● పరిశుభ్రత, సేవలపై తనిఖీ


ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కాయకల్ప బృందం

జోగిపేట, జనవరి 23: జోగిపేట ఏరియా ఆస్పత్రిని కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఏరియా ఆస్పత్రికి చెందిన వైద్య బృందం మంగళవారం సందర్శించింది. బాన్సువాడ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ నేతృత్వంలో నర్సింగ్ సూపరింటెండెంట్ క్రిష్ణవేణి, హెడ్ నర్సు మల్లీశ్వరి, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ నర్సు అమృతతో కూడిన బృందం ఆస్పత్రి ఆవరణమంతా తిరిగారు. ఆస్పత్రి లోపల, ఆవరణలో పరిశుభ్రతను, అలాగే ఇన్‌పేషెంట్ వార్డుల్లోనూ తిరిగిన వారు అక్కడి బాత్‌రూంలు, మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు. అనంతరం వైద్య సేవలు, చికిత్సల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతియేటా ప్రతీ ఆస్పత్రిలోనూ రెండురకాల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పరిశుభ్రత, సేవలపై ఒకసారి ఇంటర్నల్‌గా, మరోసారి ఎక్స్‌టర్నల్‌గా పరిశీలనకు బృందాలు వస్తాయని చెప్పారు. ఇంటర్నల్ తనిఖీలో ఒక ఆస్పత్రిని మరో జిల్లాలోని ఆస్పత్రి బృందం తనిఖీ చేస్తున్నదన్నారు. వీరిచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రస్థాయిలోని మరో బృందం వచ్చి తనిఖీలు చేస్తున్నదని పేర్కొన్నారు. దీనినే ఎక్స్‌టర్నల్ తనిఖీ అంటారన్నారు. తనిఖీల్లో ఎక్కువ మార్కులు పొందిన ఆస్పత్రులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. జోగిపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, వైద్యురాలు సమైక్యభారతి, హెచ్‌ఐవీ యూనిట్ ఇన్‌చార్జి నర్సింహా, నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

● 18 నెలల క్రితం హత్య కేసును ఛేదించిన పోలీసులు
● నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు


పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యాధికారులు


మృతుడు కావేటి కిష్టయ్య (ఫైల్)

చేగుంట, జనవరి 23: గత 18 నెలల క్రితం జరిగిన ఓ హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి, నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు రామాయంపేట సీఐ లక్ష్మీబాబు వెల్లడించారు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన కావేటి కిష్టయ్య 2022, జూలై 16న మృతిచెందాడు. అనంతరం గ్రామంలో కిష్టయ్య మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. 18 నెలల అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి కిష్టయ్య మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకున్న సీఐ లక్ష్మీబాబు విచారణ చేపట్టడంతో హత్య కేసు వెలుగులోకి వచ్చింది. 18 నెలల క్రితం పూడ్చిపెట్టిన మృతదేహానికి వైద్యాధికారులతో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. హత్యకు కారకులైన కుమారుడు స్వామి, పెద్ద కుమార్తె రేణుకను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన అల్లుడు అశోక్ పాత నేరం కింద శిక్ష అనుభవిస్తూ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కిష్టయ్య పేరున ఉన్న వ్యవసాయ భూమి కోసం కన్నతండ్రినే కొడుకు, కూతురు హత్య చేశారని సీఐ తెలిపారు. హత్య కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడం పట్ల పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.


వివరాలను వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీబాబు

గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

● రచయిత, ప్రొ.కంచ ఐలయ్య ● 31న తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహావిష్కరణ సభ


గద్దర్ విగ్రహావిష్కరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రచయిత ప్రొ.కంచ ఐలయ్య

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని తెలంగాణ ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని ప్రసిద్ధి రచయిత, ప్రొఫెసర్ కంచ ఐలయ్య డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో గద్దర్ గళం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించే గద్దర్ విగ్రహావిష్కరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గద్దర్ కేవలం పాటగాడు మాత్రమే కాదని, ఒక ఫిలాసఫర్, రచయిత, నటుడు, మేధావిగా ఈ దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. అలాంటి మహా కళాకారుడిని గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజలకు ఉన్నదన్నారు. గద్దర్ గళం ఫౌండర్ కొల్లూరి సత్తయ్య మాట్లాడుతూ గద్దర్‌కు తెల్లాపూర్ గ్రామానికి ఎంతో అనుబంధం ఉన్నదని పేర్కొన్నారు. గద్దర్ విగ్రహావిష్కరణకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, కంచ ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, జేబీ రాజు, బాలయ్య, గద్దర్ కుమార్తె వెన్నెల, తెల్లాపూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, సినీ దర్శకుడు వేణుఉడుగుల, ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పసునూరి రవీందర్, భరత్, సింగర్ వరం, శంకర్, మణికంఠ హాజరుకానున్నట్లు సత్తయ్య తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

● నిద్రిస్తున్న భక్తుడి పైనుంచి కారు తోలిన డ్రైవర్ ● అక్కడికక్కడే దుర్మరణం
● అనుయాయులతో గొడవపడి డ్రైవర్ పరార్



మృతిచెందిన పెద్దింటి బలరాం, బలరాం(ఫైల్)

చేర్యాల, జనవరి 23: కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి నిద్రలోనే ప్రాణాలు కోల్పోయాడు. కొమురవెల్లి మల్లన్న పట్నంవారాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా, తాండూరు మండలం రిశీవాడ గ్రామానికి చెందిన పెద్దింటి బలరాం(65) ఇంటిల్లిపాదిగా చేరుకుని మల్లన్నను దర్శించుకున్నారు. అగ్నిగుండాలు దాటిన అనంతరం సోమవారం సాయంత్రం కొండపోచమ్మకు తరలివెళ్లారు. ఆలయ సమీపం నాగపురి శివారులోని ఆరుబయట ప్రదేశంలో బస చేసి దర్శనాలు చేసుకున్నారు. రాత్రి కుటుంబసభ్యులందరితో భోజనం చేసి నిద్రించారు. ఇతర భక్తులు సమీప ప్రదేశంలో వాహనాలను నిలిపారు. ఓ కారు డ్రైవర్ అర్ధరాత్రి దాటిన తర్వాత సంబంధిత ప్రదేశం నుంచి బయటకు వెళ్లేందుకు కారును వెనకకు నడిపాడు. అక్కడ బలరాం నిద్రించిన విషయాన్ని చూడకుండానే అతడి పైనుంచి కారు తీసుకెళ్లడంతో మృతిచెందాడు. గమనించిన కుటుంబసభ్యులు అడ్డుకుని నిలదీయడంతో తన అనుయాయులతో గొడవపడి ఉడాయించాడు. ఈ విషయమై మృతుడి కుటుంబీకులు మంగళవారం కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పంచనామా చేసి చేర్యాల మార్చురీలో పోస్టుమార్టం నిర్వహింపజేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఉన్నత లక్ష్యానికి చేరువయ్యేందుకు కష్టపడి చదవాలి

● గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్


గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మోటీవేషనల్ తరగతిని ప్రారంభిస్తున్న ఏసీపీ, సినీనటులు

గజ్వేల్, జనవరి 23: విద్యార్థులు ఉన్నత లక్ష్యానికి చేరువయ్యేందుకు కష్టపడి చదవాలని గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ పిలుపునిచ్చారు. ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటివేషనల్ సెమినార్ మహతి ఆడిటోరియంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా గజ్వేల్ ఏసీపీ రమేశ్, సినీనటులు కేవీ ప్రదీప్, నళిని హాజరయ్యారు. ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని, సమాజంలో జరుగుతున్న సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని సాధించే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ సభ్యులను ఏసీపీ అభినందించారు. సినీనటుడు కేవీ ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చాలా నేర్చుకోవడానికి అవకాశాలుంటాయని, ఇలాంటి సమయంలోనే విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని, వారి ఆశయాల, లక్ష్యాల సాధనకు పట్టువదలకుండా శ్రమించాలన్నారు. ఆధునిక ప్రపంచంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకునేందుకు ఉన్నతమైన లక్ష్యాలను చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు వినోద్, రవి, ప్రధాన కార్యదర్శి కర్ణాకర్, సభ్యులు వెంకట్, అక్బర్, స్వామి, విష్ణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో కూలీ ఆత్మహత్య


అగయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 23: అప్పులబాధతో కూలీ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామానికి చెందిన వల్లపు అగయ్య(40) వడ్డెర కులస్థుడు. గ్రామంలో 40 ఎకరాల వరకు విస్తరించి ఉన్న రాయిగుట్ట వద్ద రాళ్లు కొడుతూ, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత ప్రభుత్వం ఈ గుట్టపైన మిషన్ భగీరథ తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేసింది. రాళ్ల బ్లాస్టింగ్ చేసే సమయంలో ప్లాంట్‌కు పగుళ్లు, తదితర ఇబ్బందులు ఎదురవుతుండడంతో సంబంధిత అధికారులు రాయి కొట్టేందుకు అనుమతులు నిరాకరించారు. దీంతో గ్రామానికి చెందిన 50 వడ్డెర కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. అగయ్య ఉపాధి కోసం గజ్వేల్ సమీప గ్రామాల్లో కూలి పనులకు వెళ్తుండేవాడు. కుటుంబ అవసరాల కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. అయితే అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా గ్రామ శివారు నిర్మానుష్య ప్రదేశంలో చెట్టుకు ఉరేసుకుని ఉండడం చూసి సమీప వ్యవసాయ పొలాల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకుతీశారు. ఘటనా స్థలానికి అగయ్య భార్య మృతదేహం తన భర్తదేనని చెప్పింది. పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య కనకవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ ప్లాంట్ ఏర్పాటుతో 50 కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని సర్పంచ్ తూం శేఖర్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

● చిట్కుల్ కేజీబీవీ ఎస్‌వో అంజలి, కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచ్ పోచయ్య


మెడల్స్, ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థులు

చిలప్‌చెడ్, జనవరి 23: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉన్నదని చిట్కుల్ కేజీబీవీ ఎస్‌వో అంజలి, కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచ్ పోచయ్య అన్నారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ ఉమెన్స్ లీగ్ పోటీల్లో కస్తూర్బాకు చెందిన ఆరుగురు విద్యార్థులు పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. మంగళవారం విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. పీఈటీ శారద, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, పద్మావతి, ప్రశాంతి, మంజుల, మహేశ్వరి, మధులత, కీర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

270 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● గుజరాత్‌కు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
● పౌర సరఫరాల శాఖకు అప్పగింత

పుల్‌కల్, జనవరి 23: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని కాటేదాన్ నుంచి (జీజే25యూ7752) నంబరు గల లారీలో 270 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుజరాత్‌కు తరలిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున బియ్యం తరలిస్తున్న లారీని డ్రైవర్ రాజు భాయ్ బోసియా శివంపేట గ్రామ శివారులో గల దాబా వద్ద జోగిపేట వైపు వెళ్తూ జాతీయ రహదారిపై నిలిపాడు. ఈ క్రమంలో అటువైపుగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న స్థానిక పోలీసులకు అనుమానం వచ్చి డ్రైవర్‌ను ప్రశ్నించగా, పొంతన లేని సమాధానం చెప్పాడు. దీంతో లారీలో ఉన్న సరుకును పరిశీలించగా.. అది రేషన్ బియ్యంగా గుర్తించారు. లారీని పుల్కల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కమ్ ఓనర్ రాజు భాయ్ బోసియాపై కేసు నమోదు చేశారు. అనంతరం పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పోలీసులు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు.

దేశభక్తికి ప్రతిరూపం నేతాజీ సుభాష్‌చంద్రబోస్


సిద్దిపేటలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తపస్ నాయకులు


గజ్వేల్‌లో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


హుస్నాబాద్‌లో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

సిద్దిపేట క్రైం, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశభక్తికి ప్రతిరూపం అని, ఆయన అవిభాజ్య భారతదేశ మొదటి ప్రధానమంత్రి అని సిద్దిపేట జిల్లా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా తపస్ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుముల మురళి, రాష్ట్ర బాధ్యులు శ్రీనాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, లింగం, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట వైస్ ప్రిన్సిపాల్ గణపతి, అకాడమిక్ కోఆర్డినేటర్ బాలరాజు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ భవాని, రమేశ్‌బాబు, విజయభాస్కర్, పెద్దిరాజు తదితరులు ఉన్నారు. గజ్వేల్ పట్టణంలోని వివేకానందుడి విగ్రహం వద్ద నేతాజీ చిత్రపటానికి యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశబోయిన నర్సింహులు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట యువజన సంఘాల ప్రతినిదులు నాయిని సందీప్, మంతూరి నాగరాజు, గుంటిపల్లి కుమార్, తాటోజీ నర్సింహాచారీ తదితరులు ఉన్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎలగందుల శంకర్, రైతు సంఘం నాయకులు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, కవ్వ రాజిరెడ్డి, బీసీ సంఘం నాయకులు తదితరులున్నారు.

● **నంగునూరు:** స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన సుభాష్ చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామస్వామిగౌడ్ అన్నారు. స్వాతంత్ర సమరయోధులు ఆజాద్ హింద్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** పట్టణంలోని నేతాజీ విగ్రహానికి పంచతంత్ర పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సమాజహితానికి పాటుపడాలని సూచించారు.


అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీని, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

టీఎస్ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

సిద్దిపేట అగ్రికల్చర్ జనవరి 23: జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ చేతుల మీదుగా తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఉద్యోగులందరూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం అందించే వివిధ పథకాలను రైతులు అందరికీ చేరేలా కృషి చేయాలని, అలాగే పంట దిగుబడులు పెంచేందుకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ శివప్రసాద్, ఏడీఏ అనిల్, రాధిక, తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి పరశురాం రెడ్డి, వ్యవసాయ అధికారులు నరేష్, శివరామకృష్ణ, ప్రకాష్ గౌడ్, వసంతరావు, ఆఫ్రోజ్ లు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో 'బేటీ బచావో-బేటీ పడావో'


బేటీ బచావో-బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగరాజు

రాయపోల్, జనవరి 23: మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా ఫైనాన్సియల్ లిటరసీ అధికారి ఎస్.నాగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, మహిళలకు ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, జెండర్ సమానత్వం, పిల్లల హక్కులు, గర్భస్థ శిశు నిర్ధారణ నిరోధక చట్టం-1994 యాక్టు, గృహహింస నిరోధక చట్టం-2005, బాల్యవివాహాల చట్టం-2006 గురించి వివరించారు. వారితో అంగన్‌వాడీ టీచర్ ప్రతిభ తదితరులున్నారు.

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 'కీ టూ సక్సెస్'


మాట్లాడుతున్న మల్లేశ్

గజ్వేల్, జనవరి 23: సత్యసాయి సేవా సంస్థలు-గజ్వేల్, బూర్గుపల్లి వారి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను ఏర్పాటు చేశారు. కీ సక్సెస్ అనే ప్రేరణ కార్యక్రమాన్ని గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మల్లేశ్ హాజరయ్యారు. విద్యార్థులకు ఒత్తిడిని తట్టుకుని పరీక్షలు రాయడం ఎలా? అనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు నర్సింలు, మండల విద్యాధికారి సునీత, గజ్వేల్ మండల నోడల్ అధికారి వై.కృష్ణ, రాష్ట్ర పూర్వ బాలవికాస్ ఇన్‌చార్జి వై.సుఖేందర్, రాష్ట్ర గ్రామ సేవ మహాయజ్ఞం సభ్యుడు వెంకటనర్సింహ్మారెడ్డి, సత్యసాయి సేవా సమితి గజ్వేల్ కన్వీనర్ వెంకటేశం, శ్రీ సత్యసాయి సేవా సమితి బూర్గుపల్లి కన్వీనర్ బాలనర్సయ్య, తలకొక్కుల లక్ష్మణ్, వై.మహేశ్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కల్వకోట సురేందర్‌రావు ఇక లేరు

● చేర్యాలలో నివాళులర్పించిన ప్రముఖులు, నాయకులు


పట్వారి కల్వకోట సురేందర్‌రావు (ఫైల్)

చేర్యాల, జనవరి 23: ఉన్నత కుటుంబమే అయినప్పటికీ సామాన్యుల్లో ఒకరిలా అందరికీ సాయపడుతూ కరుణాభావంతో మెదలిన పట్వారి కల్వకోట సురేందర్‌రావు(72) ఇక లేరు. కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురైన సురేందర్‌రావు సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన ఎంతో విలువైన తన భూములను విరాళంగా అందించడంతో చేర్యాల ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, ఆలయాలు, ఇతర అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగిపోయాయి. సురేందర్‌రావు మృతిపట్ల మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మాజీ సర్పంచు అవుశర్ల యాదయ్య, కౌన్సిలర్లు ముస్త్యాల తార, సీపీఐ నాయకులు అందె అశోక్‌తో పాటు ఆయా పార్టీల నేతలు, నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాగా 'ఆంధ్రజ్యోతి'పై పట్వారి సురేందర్‌రావుకు వల్లమాలిన అభిమానం. రోజూ ఆంధ్రజ్యోతి దినపత్రిక చదవనిదే ఏపని చేసేవాడు కాదని కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవల ఆయన ఆరోగ్యం క్షీణించేంత వరకు ఆయన ఆంధ్రజ్యోతిని వీడలేదని వివరించారు.

వరిలో బయోగుళికలు వేయకూడదు

కొండపాక, జనవరి 23 : వరిలో బయో గుళికలు వేయకూడదని వ్యవసాయశాఖ అధికారి ప్రియదర్శిని రైతులకు సూచించారు. కొందరు రైతులు వరిలో బయోగుళికలు వేస్తున్నారని వీటి వల్ల ఎలాంటి లాభం చేకూరదని పేర్కొన్నారు. ఈ గుళికలు కేవలం పెరుగుదలకు మాత్రమే తోడ్పడతాయని తెలిపారు. మొగి పురుగు, ఆకు చుట్టు పురుగు, సుడిదోమ పై ఎటువంటి ప్రభావం చూపవన్నారు. మన ప్రాంతంలో ఈ మోగి పురుగు పెరగడానికి ప్రధాన కారణం రైతులు ఈ గుళికలను 3జీ గుళికలు , 4జీ గుళికలు అని భావించి వేస్తున్నారన్నారు. రైతులు ఈ గుళికలను వేయరాదని తెలిపారు. కొందరు ఊర్లలో తిరుగుతూ బయోగుళికలను అమ్ముతున్నారని ఇలా అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. కేవలం అధికృత షాపుల ద్వారా మాత్రమే అమ్ముకోవాలని తెలిపారు. ఆ గుళికలు ఎందుకు పనిచేయవు కేవలం మొక్క పచ్చబడడానికి మాత్రమే తోడ్పడతాయి. ఇటువంటి వారు ఎవరైనా వస్తున్నట్లయితే వ్యవసాయ అధికారికి, వ్యవసాయ విస్తరణ అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు రైతులకు సూచించారు.

కిడ్నీ బాధితుడికి అండగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ

సిద్దిపేట టౌన్, జనవరి 23: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆర్థిక సహకారంతో అండగా నిలిచింది. సిద్దిపేట పట్టణానికి చెందిన గట్టు బుచ్చయ్యకు రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేస్తున్న సందర్భంగా అనారోగ్యంతో మందులకు, రవాణా ఖర్చులకు కూడా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మంగళవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గట్టు బుచ్చయ్య సతీమణి భానుమతికి రూ. 56 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అయిత రత్నాకర్ మాట్లాడుతూ.. సమాజంలోని పేద ప్రజలకు జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి ఇలాంటి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వారి వెంట జిల్లా ఆర్యవైశ్య మహాసభ నాయకులు అత్తెల్లి లక్ష్మయ్య, తణుకు ఆంజనేయులు, మాంకాల నాగరాణి, మాడిశెట్టి హేమలత, అయిత పురుషోత్తం, గంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచు చెరుకు రమణారెడ్డి

చేర్యాల, జనవరి 23 : ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఐనాపూర్ గ్రామసర్పంచు చెరుకు రమణారెడ్డి అన్నారు. మన ఊరు, మనబడిలో భాగంగా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మూసివేతకు గురైన పాఠశాలల పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటుందన్నారు.

ఆఫర్ పేరిట మోసగించే యత్నం

● పోలీసులకు ఫిర్యాదు చేస్తామనడంతో పరార్

చేర్యాల, జనవరి 23: ఆఫర్ పేరిట ఓ వ్యక్తిని బురిడీ కొట్టించాలని యత్నించిన కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తామనడంతో పరారయ్యారు. ఈ సంఘటన మంగళవారం చేర్యాల పట్టణంలోని నాలుగవవార్డు పరిధిలో చోటుచేసుకున్నది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చే వేసవి దృష్ట్యా వాటర్ కూలింగ్ క్యాన్ రూ.100లకే అందిస్తామంటూ కొందరు వ్యక్తులు స్థానిక శ్రీనగర్ కాలనీకి చేరుకున్నారు. తక్కువ ధరకే వస్తుందనడంతో ఓ వ్యక్తి వారిని పిలిచి బేరం చేశాడు. వాటితోపాటు ట్రిపుల్ ఎక్స్, ఇతర కంపెనీకి చెందిన సబ్బులను తక్కువ ధరకు అందిస్తామని, వాటిలో ఉండే స్క్రాచ్ కార్డు ప్రకారం రూ.8వేల విలువగల వస్తువులు రూ.4 వేలకు ఇస్తామని చెప్పడంతో అతడు అంగీకరించాడు. ఓ స్క్రాచ్‌కార్డును పరిశీలించిన అనంతరం సదరు ఆఫర్ రావడంతో తనకేమీ వద్దని తెలిపాడు. దీంతో వారు తప్పనిసరిగా సామగ్రి కొనుగోలు చేయాల్సిందేనంటూ అతడితో వాగ్వాదానికి దిగారు. ఎంతచెప్పినా వినకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామనేసరికి, వారు ఒక్కసారిగా ఉడాయించారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పై కేసు నమోదు

బెజ్జంకి, జనవరి 23: మండలంలోని గాగిల్లాపూర్ మోయ తుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

శంభు లింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

కొండపాక, జనవరి 23: మండల పరిధిలోని దుద్దెడలో చారిత్రక శైవ క్షేత్రం స్వయంభూ శంభు లింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ పాలక మండలి ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5, 6, 7 తేదీలలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 7వ తేదీన శివపార్వతుల కల్యాణం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గోనె శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు నర్రా రాఘవరెడ్డి, నూనె కుమార్ యాదవ్, మంచాల కృష్ణమూర్తి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బియ్యాన్ని పక్కదారి పట్టించినవారిపై విచారణ చేయాలి

హుస్నాబాద్, జనవరి 23 : హుస్నాబాద్‌లోని రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వానికి ఇచ్చే బియ్యాన్ని పక్కదారి పట్టించి కోట్లాది రూపాయలు దండుకున్నారని, ఈ విషయంపై విచారణ జరిపించాలని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రాంతంలోని రైసు మిల్లర్లు సీఎంఆర్ కోసం ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి ఇచ్చిన ధాన్యాన్ని వివిధ రాష్ట్రాలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారని తెలిపారు. పట్టణంలోని ఒక మిల్లు యజమాని దాదాపు రూ. 20 కోట్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించాడని, ఆయనపై కేవలం కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పటికైనా ఇక్కడి రైసు మిల్లులపై దాడులు జరిపి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

షబ్బీర్ అలీ నియామకం హర్షణీయం


గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు మతీన్, సర్దార్‌ఖాన్

గజ్వేల్, జనవరి 23: తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ నియామకం హర్షణీయమని గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు సయ్యద్ మతీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడిని ప్రభుత్వ సలహాదారుగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు వహీద్, జాకీర్, అజ్గర్, జహంగీర్, సాబేర్, బాబ, జేబ్బెర్, అజహర్, సమీర్, మున్నా, ముక్తార్, అద్దు, రఫీ, ఖాజా తదితరులున్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఎదుగుదల

నంగునూరు, జనవరి 23: క్రీడలు విద్యార్థుల మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈవో దేశిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంగునూరు మండలం పాలమాకుల లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాపోటీలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ఎదుగుదలకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అంతకు ముందు ఎంఈవో దేశిరెడ్డి జెండా ఎగురవేయగా, రాజగోపాల్‌పేట ఏఎస్‌ఐ రంగారెడ్డి ఒలింపిక్ ల్యాంప్ వెలిగించారు. పాలమాకుల గ్రామ సర్పంచ్ పంగ కుమార్, ప్రిన్సిపాల్ కె.వర్గీస్, డైరెక్టర్ పబ్బోజు సత్యం క్రీడలను ప్రారంభించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు

బీఎస్పీ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రమణాకర్



గజ్వేల్, జనవరి 23: బహుజన్ సమాజ్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కానుగుల రమణాకర్ నియమితులయ్యారు. గజ్వేల్ నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఈఆర్ మోహన్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కానుగుల రమణాకర్‌ను నియమించారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రోమాల బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కటికల ఓంప్రకాశ్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు కొండనోళ్ల నరేశ్, కేతోజీ వినోద్‌చారీ, మాజీ అధ్యక్షుడు మొండి కరుణాకర్, ఉపాధ్యక్షుడు గుర్రం ఎల్లం, ఈసీ మెంబర్ కనకప్రసాద్, నవీన్, మండల నాయకులు తదితరులున్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం'

హుస్నాబాద్, జనవరి 23: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలు, కార్యచరణను వివరించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, జిల్లా కోశాధికారి డొడ్డి శ్రీనివాస్, బోనగిరి రవి, తోట సమ్మయ్య, గాదాసు రాంప్రసాద్, బోగా మహేష్కర్, అకోజుఅరుణ్,రాజేందర్, చందు, నరేష్ తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి

● ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 23: పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి స్వచ్ఛభారత్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా పారిశుధ్య కార్మికులనే ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి డప్పు శివరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పాల్గొని మాట్లాడారు.. ఎన్నో ఏళ్లుగా పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని దుయ్యబట్టారు. పారిశుధ్య కార్మికుల బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రముఖులను పెట్టడం సరికాదని, బ్రాండ్ అంబాసిడర్లు పారిశుధ్య కార్మికులను పెట్టాలన్నారు. ఫిబ్రవరి 29న హైదరాబాదులోని ఇందిరా పార్క్‌లో నిర్వహించ తలపెట్టిన పోరుగర్జన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర సీనియర్ నాయకులు కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

ధరణి సమస్యలపై అధ్యయనంలో పాల్గొననున్న కలెక్టర్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 23: ధరణి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ సచివాలయంలో ధరణి సమస్యలపై అధ్యయనంలో జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నది. ఈ మేరకు ధరణి సమస్యలపై అధ్యయనంలో రాష్ట్రంలోని ఐదు జిల్లాల కలెక్టర్లు పాల్గొననున్నారు. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొంటారు.

నేడు మంత్రుల పర్యటన

మిరుదొడ్డి, జనవరి 23: మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్టు ఆ గ్రామ సర్పంచు కిష్టయ్య తెలిపారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని పంచాయతీ భవనం, కూరగాయల మార్కెట్, తదితర అభివృద్ధి పనులను మంత్రులు ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గజ్వేల్ రూరల్, జనవరి 23. గజ్వేల్ మండలం బెజగామ ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం భారత రాజ్యాంగ అమలుపై డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎంబీడీసీ మాజీ చైర్మన్

చేర్యాల, జనవరి 23: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని మంగళవారం టీఎస్ఎంబీడీసీ మాజీ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా మల్లన్నకు అభిషేకం నిర్వహించి మొక్కులుతీర్చు కున్నారు.

ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం


ఐఎన్‌టీయూసీ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, జనవరి 23: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని కచ్చితంగా అమలు చేస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన స్వగృహంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ ఎలక్ట్రిసిటీ శాఖ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేద ప్రజలకు సేవ చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఆయనవెంట నాయకులు మద్దూరి మల్లారెడ్డి, సయ్యద్ మతీన్, సర్దార్‌ఖాన్, అజ్గర్, వహీద్, నెంటూరు కుమార్, దయానందరెడ్డి, జాకీర్ తదితరులున్నారు.

'నమో నవ్ మత్‌దాత సమ్మేళన్'ను జయప్రదం చేయండి


గజ్వేల్‌లోని డిగ్రీ కళాశాల విద్యార్థులతో బీజేవైఎం నాయకులు

గజ్వేల్, జనవరి 23: నమో నవ్‌మత్‌ధాత సమ్మేళన్‌ను జయప్రదం చేయాలని సిద్దిపేట జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశమైన ఆయన నమో నవ్‌మత్‌దాత సమ్మేళన్‌లో ప్రధాని నరేంద్రమోదీ సంభాషించనున్నారన్నారు. 780078200 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పిస్తూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25న ప్రధాని మోదీ యువ ఓటర్లను ఉద్దేశించి సంభాషించనున్నారని తెలిపారు. యువతకు ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. వివిధ రంగాల్లో అద్భుతమైన మైలురాళ్లను అధిగమిస్తూ యువతకు బంగారు భవిష్యత్తుకు మోదీ గ్యారెంటీని ఇస్తున్నారన్నారు. ప్రతీ ఒక్క నూతన ఓటరు తన ఓటుతో ప్రతి ధ్వనించాలని, యువకులు పెద్ద ఎత్తున నరేంద్రమోదీకి మద్దతు పలకాలన్నారు. ఆయనవెంట బీజేపీ నాయకులు నత్తి శివకుమార్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం మహిపాల్‌యాదవ్, మన్నె శేఖర్, బీజేవైఎం గజ్వేల్ పట్టణాధ్యక్షుడు ఆర్‌కే యాదవ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి గ్రామకమిటీలు


మర్కాముల గ్రామకమిటీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న జీవన్‌రెడ్డి

మద్దూరు, జనవరి 23: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ సొసైటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మద్దూరు మండలం మర్కాముల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా కత్తుల భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా అల్ల లింగం, మంద రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా వగలబోయిన యాదగిరి, యూత్ అధ్యక్షుడిగా డొంకెన బాపురాజు, ప్రధాన కార్యదర్శిగా గుండ్రెడ్డి సత్యనారాయణరెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా సుందరగిరి తిరుమల, కార్యదర్శిగా చిగుళ్ల కలమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

తోర్నాలలో గ్రామ కమిటీ ఎన్నిక

దూళిమిట్ట మండలంలోని తోర్నాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుషాలపురం బాలయ్య, ఉపాధ్యక్షుడిగా చొప్పరి పెద్ద రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రాజు, కార్యదర్శిగా వగలబోయిన శ్రీనివాస్, కోశాధికారిగా గోనెపల్లి స్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి మహేష్, ఉపాధ్యక్షుడిగా కొమ్మరాజుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ కె ఆసీఫ్, మహిళా అధ్యక్షురాలుగా పేరం విజయ, ఉపాధ్యక్షులుగా గొనెపల్లి లక్ష్మి, కమిటీ సభ్యులు ఆంజనేయులు, చొప్పరి శివలింగం, చొప్పరి రాము ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చొప్పరి పరశురాములు, మాజీ సర్పంచ్ కోల అయిలయ్య, నాయకులు కోల సాయిలు, గొనేపల్లి పరశురాములు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు మోక్షమెన్నడో?

● మండలంలో మంజూరైన రోడ్లు- 5
● నత్తనడకన సాగుతున్నవి-3
● ఇంకా ప్రారంభించని పనులు- 2
● ఏడాది క్రితం టెండర్లు పూర్తయినా పనుల్లో జాప్యం


అసంపూర్తిగా వదిలేసిన బుగ్గరాజేశ్వరస్వామి దేవస్థానం బీటీ రోడ్డు

నారాయణరావుపేట, జనవరి 23: మండలంలో గ్రామాల మధ్య అనుసంధానాన్ని పెంచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనుల్లో జాప్యం తప్పడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం నారాయణరావుపేట మండలంలోని ఆయా గ్రామాల మధ్య దూరభారం తగ్గించే దిశగా బీటీ రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.14.55 కోట్ల నిధులు మంజూరు చేయడంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు కృషి ఎంతో ఉంది. శాఖాపరంగా టెండర్లు పిలిచి పనులకు అగ్రిమెంట్ సైతం పూర్తయినప్పటికీ బీటీ రోడ్ల నిర్మాణపనుల్లో తీవ్ర జాప్యం జరుతున్నదని అయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే మండల కేంద్రానికి దూరభారం తగ్గడంతో పాటు ప్రయాణం సులభతరమవుతుందని ప్రజలు అంటున్నారు.

13.5(కిలోమీటర్ల రోడ్డు పనులకు నిధులు మంజూరు

మండలంలోని అయా గ్రామాల మధ్య దూర భారం తగ్గించేందుకు 13.5 కీలో మీటర్ల బీటి రోడ్డు నిర్మించేందుకు గాను రూ.14.55 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొన్ని రోడ్ల పనులు ప్రారంభించినప్పటికీ మరో రెండు రోడ్ల పనులను అసలు ప్రారంభించనేలేదు. ముఖ్యంగా బుగ్గరాజేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే రోడ్డును గత శివరాత్రి పండగకు ముందు అర్భాటంగా బీటీ రోడ్డు పనులు ప్రారంభించి కొంత మేరకు బీటీ పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు ప్రయాణం ఇబ్బందిగా మారింది. గుర్రాలగొంది- లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రోడ్డు, మాటిండ్ల- జిల్లాల రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండగా, గోపులాపూర్, మల్యాల గ్రామాల నుంచి నారాయణరావుపేట మండల కేంద్రాన్ని కలిపే రోడ్ల పనుల్లో ఎలాంటి పురోగతి లేదని, వెంటనే పనులు ప్రారంభించాలని అయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పనులు త్వరలోనే పూర్తి చేస్తాం

మండలంలో 5 రోడ్లకు నిధులు మంజూరై, టెండర్లు సైతం పూర్తయ్యాయి. ప్రస్తుతం మూడు రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. గోపులాపూర్, మల్యాల గ్రామాల పనులను సైతం త్వరలోనే చేపడతాం. త్వరగా పనులు పూర్తి చేసి రోడ్లను వినియోగంలోకి తెస్తామన్నారు.

-సతీష్, పంచాయతీరాజ్ ఏఈ


ఇంకా ప్రారంభించని గోపులాపూర్-నారాయణరావుపేట రోడ్డు పనులు